చేసింది గోరంతే.. చేయాల్సింది కొండంత!

- 111 పనులకు గాను పూర్తి అయింది 39 పనులే
- బిల్లుల చెల్లింపుల జాప్యం వల్ల నిలచిన 15వ ఆర్థిక సంఘ పనులు
- కుంటుపడుతున్న తెనాలి అభివృద్ధి


30వ వార్డు అమరావతి ప్లాట్స్‌లో ప్రారంభం కాని సీసీ డ్రైన్


జిల్లా వైద్యశాల రోడ్డులో నేటికీ ప్రారంభం కాని సీసీ డ్రైన్


32వ వార్డు యడ్లలింగయ్య కాలనీలో 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

తెనాలిఅర్బన్: చేసింది గోరంత... చేయాల్సింది కొండంత.. అన్న చందానా 15వ ఆర్థిక సంఘ పనులు జరుగుతున్నాయి. నాలుగు సంవత్సరాల్లో 111 పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చి నిధులు విడుదల చేసినా కేవలం 39 పనులను మాత్రమే మున్సిపల్ అధికారులు పూర్తి చేయించగలిగారు. మిగిలిన వాటిలో 22 పనులు జరుగుతూ ఉండగా, 50 పనులు నేటికీ ప్రారంభం కాలేదు. దీంతో తెనాలి పట్టణ అభివృద్ధి అమడదూరంలో నిలచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రతి ఏటా నిధులొస్తాయి

పురపాలక సంఘాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘ పేరిట నిధులు విడుదల చేస్తుంటుంది. ప్రతి ఏడాది వాటి పేరట పురపాలక సంఘ స్థాయిని బట్టి నిధులు విడుదల చేసి వాటిని పట్టణాల్లోని అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవాలని సూచిస్తుంది. అంతేకాకుండా వాటికి అయిదు సంవత్సరాల కాలపరిమితిని విధించి ఆ లోపు పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి తీసుకుంటుంది.

తెనాలి పురపాలక సంఘానికి కోట్లు రూపాయలు రాక

15వ ఆర్థిక సంఘ నిధులను కేంద్రం 2020 నుంచి విడుదల చేయటం ప్రారంభించింది. 2020–21 సంవత్సరానికి రూ.12.88 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులను 77 అభివృద్ధి పనుల వినియోగానికి కేటాయించేలా మున్సిపాలిటీ అనుమతులు తీసుకుంది. అలాగే 2021–22లో రూ.9.58 కోట్ల నిధులను విడుదల చేయగా వీటిని 7 పనులకు కేటాయించారు. అలాగే 2022–23లో రూ.9.89 కోట్ల నిధులు విడుదల కాగా వాటిని 20 పనులకు కేటాయించారు. 2023–24 సంవత్సరంలో ఇప్పటి వరకు 5.39 కోట్ల నిధులు విడుదల కాగా వీటిని 7 పనులకు కేటాయించారు. ప్రస్తుతం రూ.అయిదు కోట్ల నిధులు విడుదలకు అనుమతులు వచ్చాయి. వీటిని ఎన్ని పనులకు కేటాయించాలనే దానిపై ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

వినియోగంలో ఎందుకీ జాప్యం?

15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగంలో తెనాలి పురపాలక సంఘం వెనుకంజలో ఉంది. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల వీటి వినియోగంలో జాప్యం జరుగుతుందనేది మాట కాంట్రాక్టర్‌ల నుంచి వినిపిస్తోంది. 15వ ఆర్థిక సంఘం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు కావస్తున్నా 2020లో అనుమతులు పొందిన 21 పనులు నేటికీ ప్రారంభం కాలేదంటే అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో మనకు అర్థమౌతుంది. తెనాలి పట్టణంలో 15వ ఆర్థిక సంఘ నిధుల కింద వచ్చిన రూ.37.76 కోట్ల నిధులలో సుమారు రూ.18 కోట్ల నిధులను వినియోగించారు. మిగిలిన రూ.19 కోట్ల నిధుల వినియోగం నేటికీ జరగలేదు.

కుంటుపడుతున్న అభివృద్ధి

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల తెనాలి అభివృద్ధి రోజురోజుకూ కుంటుపడుతోంది. ఇంజినీరింగ్ అధికారులు పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవటం వల్ల కాంట్రాక్టర్‌లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో జనరల్ ఫండ్‌తో పాటు 15వ ఆర్థిక సంఘ నిధులకు సంబంధించిన పనుల్లో నేటికీ జాప్యం జరుగుతూనే వస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు అవుతుంది. ఇప్పటి వరకు నిధులు కాకుండా మరో ఏడాదిన్నరవీ తెనాలి మున్సిపాలిటీకి వచ్చే అవకాశం ఉంది. అంటే సుమారు రూ.15 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉంది. వీటిని 2027 మార్చి నాటికి వినియోగించాల్సి ఉంది. ఈలోపు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అలా చేయని పక్షంలో నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారులు స్పందించి పనుల జాప్యంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులు ప్రారంభించేలా చర్యలు



15వ ఆర్థిక సంఘ పనులలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవం. వాటిల్లో ఎక్కువ చిన్న, చిన్న పనులే ఉన్నాయి. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌లకు నోటీసులు ఇస్తున్నాం. వారు స్పందించకపోతే టెండర్లు రద్దు చేస్తాం. మళ్లీ ప్రాధాన్యతా క్రమంలో టెండర్లు పిలిచి గడువులోగా అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– పి.శ్రీకాంత్, మున్సిపల్ ఇంజినీర్, తెనాలి పురపాలక సంఘం

క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



తెనాలిరూరల్: రూరల్ పరిధిలోని అంగలకుదురు ముక్తి రెసిడెన్షియల్ ట్రైబల్ స్కూలులో విద్యార్థులకు అవసరమైన బుక్స్‌ను పంపిణీ చేశారు. పలువురు రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ నిర్వహించారు. మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, వీఆర్వోలు కె.జార్జిథామస్, జి.నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలిగ్రామ ట్రస్ట్‌చే ప్రత్యేక పూజలు



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని ది తెనాలి కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో పెనుగొండ పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయం పర్యవేక్షణలో అఖండ హనుమాన్ చాలీసా మహాపారాయణ యజ్ఞం 8వ రోజైన గురువారం కొనసాగింది. తెల్లవారుజామున సుప్రభాత సేవ, అష్టోత్తరం, దివ్యదేశాల స్వరూప 108 సాలిగ్రామములకు తిరుమంజనం, తులసి అర్చన, చంద్రమౌళీశ్వర ఆరాధన తదుపరి స్వామీజీ భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. ఆ తర్వాత మంగళహారతి, మంత్రపుష్పం, భక్తులకు అన్నవితరణ చేశారు. శ్రీసాలిగ్రామ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, అడపా సంపత్ రాయుడు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి సన్నిధిలో శాకంబరి ఉత్సవాలు

తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని గంగా పర్వాతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం శాకాంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో హరిప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర వరప్రసాద్ ఉత్సవాలను వైభవోపేతంగా జరిపారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో విశేషంగా అలంకరించారు. పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని పలు రకాల కూరగాయలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఏటా ఆషాఢమాసంలో ఆలయంలో శాకంబరి ఉత్సవాలను ఘనంగా జరుపుతామని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆషాఢ సారె సమర్పణ



తెనాలిటౌన్: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో సువర్చలా అమ్మవారికి భక్తులు గురువారం ఆషాఢమాసం సారె భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ ఈవో హరిప్రసాద్, వంశపరంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో అమ్మవారికి భక్తులు ఆషాడమాసం సారెను సమర్పించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా షరాఫ్ బజార్‌లోని ఊరేగింపుగా బయలుదేరి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి సారె సమర్పించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు సామూహిక విష్ణు సహస్రనామా పారాయణం చేసి అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలోని సువర్చలా అమ్మవారికి భక్తులు ఆషాఢమాసం సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులు ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఏర్పరచుకోవాలి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రక్షిత్ పేర్కొన్నారు. టీబీ ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సీ ఫైడ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో గురువారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వృద్ధాశ్రమాల్లో, నైట్ షెల్టర్‌లో, ప్రభుత్వ వసతి గృహాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులు తప్పని సరిగా క్షయవ్యాధి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు కాల్వలు బాగు చేయండి



తెనాలిఅర్బన్: ప్రతిరోజు కాల్వల్లో పూడికతీత పనులు చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని 2,4 పారిశుద్ధ్య డివిజన్‌లలో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షం పడితే నీరు రోడ్లపై నిలబడకుండా కాల్వల ద్వారా వెళ్లే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన రాడ్ బెండింగ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కంచర్ల జగదీష్ (30) రాడ్ బెండింగ్ కార్మికుడిగా చేస్తూ అప్పుడప్పుడు హోల్డింగ్ డ్రైవర్‌గా వెళుతుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ రాత్రి తెలిపారు.

20న తెనాలిలో రచయిత శతజయంతి

కేంద్ర సాహిత్య అకాడమీ, వీజీకే–వీవీఎల్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణ


ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన డాక్టర్ బాబు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత శారద, మరో ప్రముఖ కవి ఆలూరి బైరాగి శతజయంతి సభను ఈనెల 20వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో మధ్యాహ్నం వరకు జరగనున్న శతజయంతి సభను కేంద్ర సాహిత్య అకాడమీ, స్వాతంత్ర్య యోధుడు వడ్లమూడి గోపాల కృష్ణయ్య, వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా జరుపనున్నారు. ఈ సందర్భంగా ముత్యంశెట్టిపాలెంలో గురువారం ఫౌండేషన్ అధ్యక్షుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అధ్యక్షతన జరిగే ప్రారంభ సభలో సాహిత్య అకాడమీ, తెలుగు సలహామండలి సభ్యుడు వల్లూరు శివప్రసాద్ స్వాగతోపన్యాసం చేస్తారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్ 'ఆలూరి బైరాగి జీవితం, రచనలు'పై, పెనుగొండ లక్ష్మీ నారాయణ 'శారద జీవితం, రచనలు' అంశంపై ప్రసంగిస్తారు. ముఖ్యతిథిగా సుప్రసిద్ధ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, విశిష్ట అతిథిగా శారద కుమార్తె శారద హాజరవుతారని తెలిపారు. అనంతరం కొత్తపల్లి రవిబాబు అధ్యక్షతన జరిగే తొలి సమావేశంలో కందిమళ్ల శివప్రసాద్, కొప్రపాటి ఆదిత్య, పేరిశెట్టి శ్రీనివాసరావులు ఆలూరి బైరాగి కవిత్వం, కథలు, నవల, నాటకం, హిందీ సాహిత్య కృషిపై పత్రసమర్పణ చేస్తారు. మధ్యాహ్నం ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షతన ఏర్పాటయ్యే సమావేశంలో కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, చెరుకూరి సత్యనారాయణలు శారద కథ, నవలా సాహిత్యంపై పత్రసమర్పణ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్ కుమార్, 'అరసం' జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జాని పాల్గొన్నారు.

చట్టసభల్లో ఓబీసీల రిజర్వేషన్లకై సిఫార్సు చేయండి


హన్సరాజ్ గంగారాం అహిర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేసన

తెనాలి: జాతీయస్థాయిలో జనగణనలోనే సమగ్ర కులగణన జరిపేందుకు అవసరమైన విధివిధానాలతో పాటు, చట్టసభల్లో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లకై కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఆ ప్రకారం గురువారం పలువురు బీసీ నాయకులతో కలిసి విజయవాడలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ, ఆరోగ్యశాఖ సహాయమంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో జాతీయ బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెనాలిలో సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అనాదిగా సామాజిక అన్యాయానికి, ఆర్థిక దోపిడీకి గురైన ఓబీసీల సాధికారితకు అవసరమైన అంశాలపై కేంద్రానికి సిఫారసు చేయాల్సిందిగా కోరారు. మహిళా రిజర్వేషన్ చట్టంలో బీసీ మహిళలకు సబ్ కోటాను కల్పిస్తూ సవరణలు చేయాలని కోరారు. ఓబీసీలకు ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు జరపాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి, ఆ మేరకు బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. క్రిమిలేయర్ ఎత్తేయాలని, ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కేటాయించాలని, ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, కోరుతూ తమ పరపతిని ఉపయోగించి కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తిచేశారు. వీరితో రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమార క్రాంతి కుమార్, రాష్ట్ర నాయకులు కేసన కోటేశ్వరరావు, విష్ణు, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెనాలిటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 12.5 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సి.హెచ్.తిరుమలదేవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ఫెర్టిలైజర్స్ షాపులపై అధికారులు మెరుపుదాడి చేశారు. జ్యోతి ఫెర్టిలైజర్స్, గోపీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్, సాయి ట్రేడర్స్, మణికంఠలో తనిఖీలు చేసి స్టాక్ రిజిష్టర్‌లో వ్యత్యాసాలను గుర్తించి కేసులు నమోదు చేశారు.

12.5 మెట్రిక్ టన్నుల ఎరువులు రూ.52.83 లక్షలు, విత్తనాలు 12.5 మెట్రిక్ టన్నులు రూ.9.14 లక్షలు, పురుగు మందులు 9.9 లక్షల రూపాయలు విలువ కలిగిన వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డీలర్లు, వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రవిబాబు, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రాజకుమారి, తెనాలి మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు, గుంటూరు మండల వ్యవసాయాధికారి బి.కిషోర్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

21న పోస్టాఫీసుల్లో లావాదేవీలకు అంతరాయం

తెనాలి: పోస్టల్ శాఖ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇనిషియేటివ్‌లో భాగంగా అప్‌గ్రేడ్ చేసిన వ్యవస్థ, డివిజనులోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 22వ తేదీ నుంచి అమలు చేయనున్నట్టు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాసు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అధునాతనమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు మారేందుకు ఈనెల 21వ తేదీన డౌన్‌టైము షెడ్యూలు చేయటమైందని తెలిపారు. డేటా మైగ్రేషన్, సిస్టమ్ ధృవీకరణలు, కాన్ఫిగరేషన్ ప్రక్రియలను సులభతరం చేయడానికి, కొత్త వ్యవస్థ సజావుగా సమర్థవంతంగా ఉందని నిర్ధారణ కోసం 21న పోస్టాఫీసుల్లో ఎలాంటి ప్రజాలావాదేవీలు నిర్వహించేది లేదని ఆయన తెలిపారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు



తెనాలిరూరల్: రైతులు ఎదుర్కొంటున్న పొలాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ వెల్లడించారు. అయితానగర్ గోలి డొంక నేలపాడు పరిధిలో వర్షాలు, వరదల సమయంలో పంటలు ముంపుకు గురవుతున్నాయని రైతులు గత ఐదారేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సర్వే జరిపి కాలువ తవ్వకానికి పనులు ప్రారంభించారు. ఆ పనులను గురువారం పరిశీలించిన తహసీల్దార్ మాట్లాడుతూ అధిక వర్షాల సమయంలో నీరు బయటకు పోయే మార్గం లేక రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారని, ఇదే విషయాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులతో చర్చించి, రెవెన్యూ, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల సమన్వయంతో సర్వే జరిపించామని, గతంలో కనీసం ఇక్కడ బోదె కాలువ కూడా లేదని చెప్పారు. సర్వే అనంతరం ప్రత్యేకించి కాలువ తవ్వకానికి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కాలువ దక్షిణం వైపున కాలువలో కలపడం ద్వారా పొలాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రైతుల సమస్యల చొరవ చూపిన మంత్రికి, అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్సీ ఎస్. ఏసురత్నం, పలువురు రైతులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోండి

మున్నంగి(కొల్లిపర): దాతల గొప్ప మనసును అర్థం చేసుకుని దాతలు అందిస్తున్న పరికరాలను విద్యార్థులు అందిపుచ్చుకొని విద్యలో అభివృద్ధి చెందాలని ప్రధానోపాధ్యాయిని మునగాల ధనలక్ష్మీ అన్నారు. మండల పరిధిలోని మున్నంగి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎల్ఈ)లో పలనాడుకు చెందిన స్నేహ హస్తాలు ఫౌండేషన్ ద్వారా గురువారం విద్యార్థులకు నోట్స్, ఎక్కాల పుస్తకం, పెన్సిల్, ఇతర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని ధనలక్ష్మి మాట్లాడుతూ దాతలు తమకున్న దానిలో ఇతరులకు పంచడం జరుగుతుందని వివరించారు.

గుర్తింపు కార్డులు సరిచూసుకోవాలి

తెనాలిరూరల్: హోటళ్లు, లాడ్జీల్లో గదులు అద్దెకు తీసుకున్న వారి దగ్గర సరియైన గుర్తింపు కార్డు తీసుకోవాలని, ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని గదులను ఇవ్వాలని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు అన్నారు. త్రీ టౌన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో గురువారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులను తీసుకుని వాటి నకలును నిర్వాహకులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. 18 ఏళ్లలోపు వయసు ఉన్న వారికి పోలీసుల అనుమతి లేనిదే గదులు ఇవ్వకూడదని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అందరూ క్రమం తప్పకుండా డైలీ రిజిస్టర్‌ను కలిగి ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు వచ్చినపుడు వారి గురించి పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా జాగ్రత్త పడాలని చెప్పారు.

రేపు జస్టిస్ వెంకట జ్యోతిర్మయికి అవార్డు ప్రదానం

- పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు
- ఆహ్వానపత్రిక ఆవిష్కరణ


ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన మొవ్వా సత్యనారాయణ

తెనాలి: పట్టణానికి చెందిన మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రదానోత్సవం, ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల బహూకరణ ఈనెల 19న నిర్వహించనున్నారు. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం 9.30 గంటలకు స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరగనున్న వేడుకకు సంబంధించిన ఆహ్వానపత్రికను గురువారం కవిరాజపార్కులోని వీజీకే భవన్‌లో ఆవిష్కరించారు. సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ వివరాలను తెలియజేశారు. సేవాసమితి ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా మహిళా ప్రముఖులకు మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఆ క్రమంలోనే 2025 సంవత్సరానికి తెనాలికి చెందిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు ఈ పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తారు. అనంతరం 'విద్యార్థులు–భవిష్యత్ సవాళ్లు' అనే అంశంపై జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి మొవ్వా విజయలక్ష్మి స్మారకోపన్యాసం చేస్తారు. అదేవేదికపై గత మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో 550, ఆపైన మార్కులు సాధించిన 60 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.5 వేల వంతున రూ.3 లక్షలను బహూకరించనున్నట్టు తెలిపారు. జేఎన్‌టీయూకే, కాకినాడ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డును అందజేస్తారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పాల్గొంటారని వివరించారు. సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన పలు సేవాకార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో అబ్బూరి రామ్మూర్తి, సుగ్గుల రామకృష్ణ, వెలువోలు శరత్, కోటి రామకృష్ణ, పుచ్చకాయల కోటిరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాల కల్పనకు కృషి


హెల్త్ కార్డులు అందజేస్తున్న భక్త వత్సలం, నాగుల్ మీరా

తెనాలిఅర్బన్: సమాజశ్రేయస్సు కోసం నిత్య శ్రమించే పాత్రికేయులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఏపీయుడబ్ల్యుజె పనిచేస్తుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పేర్కొన్నారు. ఏపీయుడబ్ల్యుజె తెనాలి నియోజకవర్గ సర్వసభ్య సమావేశాన్ని బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి తెనాలి అధ్యక్షుడు చందు సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వారి సహకారంతో పాత్రికేయులకు హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ లలితా హాస్పటల్‌లో చేరితే రాయితీతో కూడిన వైద్యాన్ని అందించేందుకు లలితా హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ లలితా, డాక్టర్ రాఘవ శర్మ ముందుకు వచ్చారని, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నాయకులు భక్త వత్సలం, జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పలు వైద్యశాలలు, ల్యాబ్‌లతో ఉచిత వైద్యసేవలు అందించే విషయంపై చర్చిస్తున్నట్లు చెప్పారు. మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. తెనాలి అధ్యక్షుడు చందు సుబ్బారావు మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో 63 మందికి హెల్త్‌కార్డులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పర సుధాకర్, సీనియర్ నాయకుడు బొల్లిముంత కృష్ణ, ఐటీయూ సభ్యుడు మార్కండేయులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు సునీల్ సందీప్, తెనాలి కార్యదర్శి ఎన్.గోపిచంద్, కోశాధికారి దీపాల తారక్ సాయినాథ్, నాయకులు సిద్దుల సాయినాథ్, పి.శరత్‌బాబు, శ్యామల ప్రసాద్‌రెడ్డి, బత్తుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.